నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, బుధవారం 25 జూన్ 2025 | JAGTIAL


అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రక్కులోని బియ్యం సంచులు

- సివిల్ సప్లై, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- దాడికి పథకం.. రెడ్‌హ్యాండెడ్‌గా ట్రక్కు పట్టివేత
- మిల్లులో భారీ మొత్తంలో నిల్వలు ఉన్నట్టు గుర్తింపు
- వివరాల వెల్లడిపై పొద్దంతా హైడ్రామా
- రాత్రి 8 గంటల వరకూ ప్రకటించని అధికారులు
- కేసును నీరుగార్చేందుకు పొలిటికల్ ఒత్తిడి?

## కూలీల అవతారంలో నిఘా..

# రైస్‌మిల్లుపై దాడి!

జగిత్యాల హన్మాన్‌సాయి మిల్లులో భారీగా పీడీఎస్ బియ్యం స్వాధీనం?

జగిత్యాల సమీపంలోని హన్మాన్‌సాయి రైస్‌మిల్లుపై సివిల్ సప్లై, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం అర్ధరాత్రి ఆకస్మికంగా దాడులు చేశారు. భారీగా పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడికి పక్కాగా పథకం వేసిన అధికారులు.. కూలీలుగా అవతారమెత్తి నిఘా పెట్టడమే కాదు, రెడ్‌హ్యాండెడ్‌గా ట్రక్కును పట్టుకున్నారు. అయితే, వివరాలు వెల్లడించడంపై హైడ్రామా కొనసాగించారు. కాగా, రైస్‌మిల్‌పై చర్యలు తీసుకోవడంలో అధికారులపై పొలిటికల్ ప్రెషర్ ఉన్నట్లు తెలుస్తున్నది.

జగిత్యాల, జూన్ 24, (నమస్తే తెలంగాణ)/జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రానికి సమీపంలోని రఘురాములకోట గ్రామ శివారులో ఉన్న హన్మాన్‌సాయి రైస్‌మిల్లుపై సివిల్ సప్లై, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం రాత్రి ఆకస్మికంగా దాడులు చేశారు. భారీగా పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం.. హన్మాన్ సాయి రైస్‌మిల్లులో కొన్నాళ్లుగా పీడీఎస్ రైస్ రీసైక్లింగ్ వ్యవస్థ పెద్ద ఎత్తున నడుస్తున్నట్టు అధికారులకు సమాచారం ఉన్నది. పీడీఎస్ రైస్‌ను సేకరించి, వాటిని నల్లబజార్‌కు తరలిస్తున్నట్టు, సీఎంఆర్‌కు సైతం వినియోగిస్తున్నట్టు సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలోనే అధికారులు సోమవారం అర్ధరాత్రి రైస్‌మిల్లు వద్దకు వచ్చారు. అదే సమయంలో ట్రక్కుల్లో బియ్యం సంచులు మిల్లులోకి రావడం గమనించి, రైస్‌మిల్లుపై దాడి చేశారు. ట్రక్కులో వచ్చిన బియ్యాన్ని పరిశీలించడంతోపాటు రైస్ మిల్లులో బియ్యం నిల్వలు పెద్ద మొత్తంలో ఉన్నట్టు గుర్తించారు. అర్ధరాత్రి స్థానిక పోలీసులు, అధికారులకు సమాచారం ఇచ్చి, రైస్‌మిల్లు వద్ద పోలీస్ గస్తీ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ట్రక్కులోని బియ్యంతోపాటు మిల్లులోని బియ్యాన్ని పీడీఎస్ బియ్యమా.. కాదా..? అన్నది తేల్చేందుకు పరీక్షకు పంపించారు. కాగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ, రైస్‌మిల్లులో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెండు లారీలు, ఒక డీసీఎంఎస్ వ్యాన్ ద్వారా మరో చోటుకు తరలించామన్నారు. రైస్‌మిల్లులో లభ్యమైన బియ్యం ఎన్ని క్వింటాళ్లు ఉంటాయనే విషయంపై అర్ధరాత్రి వరకు స్పష్టత వస్తుందన్నారు. రైస్‌మిల్లు యజమాని కొండ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

### కూలీల అవతారంలో నిఘా?

హన్మాన్ సాయి రైస్‌మిల్లుపై అధికారులు పకడ్బందీ పథకంతో దాడి చేసినట్టు తెలుస్తున్నది. జగిత్యాలకు చెందిన రైస్‌మిల్లర్ల యజమాని పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నారని, అవినీతి భారీ స్థాయిలో ఉందన్న ఫిర్యాదులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చేరాయి. నిత్యావసర సరుకులను నల్లబజార్‌కు తరలించిన ఘటనలో రైస్‌మిల్లరుపై గతంలోనే సెక్షన్ 6 ఏపై పలుసార్లు, అలాగే ఎనిమిదేండ్ల క్రితం పీడీ యాక్ట్ కింద కేసు నమోదైనా బియ్యం దందా తగ్గలేదన్న ఫిర్యాదులు సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చేరినట్టు తెలుస్తున్నది. సంబంధిత శాఖ స్థానిక అధికారులు, కొందరు ఉన్నతాధికారులు సైతం చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విషయం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. మూడు రోజుల క్రితమే జగిత్యాలకు వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జగిత్యాలలోనే మకాం వేసి రఘురాములకోట గ్రామ శివారులో ఉన్న హన్మాన్ సాయి రైస్‌మిల్లుపై దృష్టి సారించినట్టు తెలుస్తున్నది. సోమవారం రాత్రి ఇద్దరు అధికారులు కూలీల అవతారంలో రైస్‌మిల్లు సమీపంలోనే నిఘాపెట్టగా, అర్ధరాత్రి బియ్యం లోడుతో ఉన్న ట్రక్కు రైస్‌మిల్లు వైపునకు రావడాన్ని గుర్తించి దాన్ని వెంబడిస్తూ రైస్‌మిల్లులోకి చేరుకొని ట్రక్కును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, లోకల్ పోలీసులతో రాత్రిపూట రైస్‌మిల్లులో గస్తీ ఏర్పాటు చేయించారు.

### పొద్దంతా హైడ్రామా !

పెద్ద మొత్తంలో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సమాచారం మంగళవారం ఉదయం స్థానిక రెవెన్యూతో పాటు, సివిల్ సప్లై అధికారులకు తెలిసింది. అలాగే, మీడియాకు సైతం వివరాలు తెలిశాయి. అయితే, రైస్‌మిల్లుపై దాడి, బియ్యం స్వాధీనానికి సంబంధించిన వివరాలు తెలియజేసే విషయంలో ఏ అధికారి కూడా అందుబాటులోకి రాలేదు. రైస్ మిల్లుకు వెళ్లి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా, రాత్రిపూట దాడి చేసి బియ్యం నిల్వలను, బియ్యం లోడుతో ఉన్న ట్రక్కులను స్వాధీనం చేసుకున్నామని, పూర్తి వివరాలు తెలియవని చెప్పడం గమనార్హం. మధ్యాహ్న సమయంలో అధికారులను కలిసి వివరాల కోసం ప్రయత్నించగా, రైస్‌మిల్లులోని బియ్యం శాంపిల్స్ సేకరించామని, అవి పీడీఎస్ బియ్యమా.. కాదా? అన్నది నిర్ధారణ కోసం పరీక్షకు పంపించామని పేర్కొన్నారు. రాత్రి 8 గంటల సమయంలో వివరాల గురించి అధికారులను సంప్రదించగా, ఎన్ని క్వింటాళ్లు, టన్నులు అనే వివరాలు చెప్పలేమన్నారు. రైస్‌మిల్లులో ఉన్న బియ్యాన్ని బస్తాల్లోకి చేర్చుతున్నామని, రెండు లారీలు, ఒక డీసీఎం వ్యాన్‌లో సరిపోయేన్ని బియ్యం ఉండొచ్చని ఉజ్జాయింపుగా పేర్కొన్నారు. బియ్యాన్ని సంచుల్లోకి నింపిన తర్వాత వాటిని తూకం వేసి పూర్తి వివరాలు చెబుతామన్నారు. అర్ధరాత్రి వరకు తూకం వేసే అవకాశాలున్నాయన్నారు.


రైస్‌మిల్లులోని బియ్యం సంచులు

### అధికారులపై పొలిటికల్ ఒత్తిడి?

రైస్‌మిల్లుపై దాడి, బియ్యం స్వాధీనం విషయంలో సివిల్ సప్లైతోపాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులపై పెద్ద స్థాయిలో పొలిటికల్ ఒత్తిడి వచ్చినట్టు సమాచారం. రైస్‌మిల్లులో దాడి సమయంలో సైతం అధికారులతో మిల్లు యజమాని కొండ లక్ష్మణ్ వాగ్వాదానికి దిగినట్లు పలు మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. అలాగే, పలువురు అధికారులకు మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జిల్లాలో కీలక స్థాయిలో పనిచేస్తున్న అధికారుల నుంచి విషయాన్ని వదిలిపెట్టాలని ఒత్తిడి వచ్చినట్టు సమాచారం. విషయం బయటకు పొక్కిందని, మీడియాకు తెలిసిందని, వదిలిపెట్టడం ఇబ్బంది అవుతుందని అధికారులు చెప్పగా, అయితే వీలైనంతగా కేసును నీరుగార్చే ప్రయత్నం చేయాలని, సాధారణ స్థాయిలో కేసులు రాసేలా చూడాలని కొందరు ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించినట్టు తెలుస్తున్నది.

## ఇందిరమ్మ ఇండ్లల్లో అర్హులకు మొండిచేయి

- గుండారంలో ఒక్క ఎస్సీకుటుంబానికి కేటాయించలే
- అర్హులైన నిరుపేదలకు కేటాయించేదాకా పోరాడుతాం
- 26న మానకొండూర్‌లో మహాధర్నా చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, జూన్ 24 : ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అర్హులకు మొండిచేయి చూపుతున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. పార్టీ కార్యకర్తలు, భూములు, ఇండ్లు ఉన్న వారికే ఇండ్లు కేటాయిస్తున్నారని, నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఇండ్లు రాని నిజమైన నిరుపేదలకు బీఆర్‌ఎస్ తరఫున అండగా ఉంటామని, వాళ్లకు ఇండ్లు కేటాయించే దాకా పోరాడుతామని స్పష్టం చేశారు. ఈనెల 26న నియోజకవర్గ కేంద్రమైన మానకొండూర్‌లో మహాధర్నా చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హులైన నిరుపేదలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంగళవారం మానకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతలు, సంక్షేమ పథకాలతో రైతులను రాజును చేస్తే, ఇప్పుడు రేవంత్ రైతుల ఉసురు తీస్తున్నారని ఆగ్రహించారు. బీఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయం పండుగలా సాగిందని, రైతు భరోసా, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, సకాలంలో ఎరువులు అందాయని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు ₹7500 రైతు భరోసా చెల్లించాలని, రైతుబీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అమాయక ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఆయన జిమ్మిక్కులను ప్రజలు నమ్మేస్థితిలో లేరని విమర్శించారు. కమిటీల పేరిట ఆ పార్టీ నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తున్న 48వేల మంది గుర్తించి గ్రామసభలలో ఎంపిక చేశారని, కానీ, ఇప్పుడు కేవలం 3200 మందికే ఇస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. ఎంపిక చేసిన వారిలో ఎంతమంది నిరుపేదలు, అర్హులు ఉన్నారో.. గ్రామ సభల ద్వారా ప్రకటించే దమ్ము, ధైర్యం కాంగ్రెస్ నాయకులకు ఉన్నదా..? అని ప్రశ్నించారు. మానకొండూర్ దళిత నియోజకవర్గమని, అలాంటిది ఇల్లంతకుంట మండలం గుండారంలో ఒక్క ఎస్సీ కుటుంబానికి కూడా ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదంటే ఏస్థాయిలో అక్రమాలు జరిగాయో ప్రజలు గమనించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, సిరిసిల్ల మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, శాతరాజు యాదగిరి, గూడూరి సురేశ్, దండబోయిన శేఖర్, పిట్టల మధు, ఉండింటి శ్యాంసన్, కోండ్ర వెంకటస్వామి, బొల్లం అనిల్, పిండి సందీప్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఉన్నతాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

## విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం

కోరుట్ల, జూన్ 24: విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. చార్జీల పెంపుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతున్నదని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులపై ప్రభావం చూపుతున్నదని ఆవేదన చెందారు. చార్జీల పెంపుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని విన్నవించారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలో బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు నూతనంగా బస్సులు నడిపించాలని, ఆర్టీసీకి అధిక ఆదాయం వచ్చే రూట్లలో మరిన్ని బస్సులను పెంచాలన్నారు. యాదాద్రి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం కోరుట్ల, మెట్‌పల్లి డిపోల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. బస్ స్టాప్‌ల వద్ద బస్సులను ఆపాలని, మరిన్ని రిక్వెస్ట్ స్టాపులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మెట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఫ్లాట్ ఫామ్‌లు పెంచాలని, అలాగే నూతనంగా మూత్రశాలలు నిర్మించాలన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ డిపోల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లీజు బేసిస్‌లో ఉన్న మెట్‌పల్లి ఆర్టీసీ డిపోకు పర్మినెంట్ అలాట్మెంట్ వచ్చేలా చూడాలని ఆర్‌ఎం రాజు దృష్టికి తీసుకెళ్లారు. కోరుట్ల, మెట్‌పల్లి డిపోల్లో అద్దె ప్రాతిపదికన త్వరలోనే వందమంది ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను నియమిస్తామని చెప్పారు. రెండు డిపోలకు కొత్తగా పది బస్సులు మంజూరయ్యాయని, వాటిని ఆయా డిపోలకు కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో డీవీఎం భూపతి, కోరుట్ల డీఎం మనోహర్, ఆర్టీసీ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శంకరయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

- ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి

జగిత్యాల, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు అందక మాజీ సర్పంచులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి వాపోయారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక.. అప్పులు తీర్చే దారి కానరాక గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లి మాజీ సర్పంచ్ దాసరి శంకరయ్య(50) ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సర్పంచ్ శంకరయ్య తన గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేశాడని, సుమారు ₹10 లక్షల వరకు అప్పుల పాలయ్యాడని చెప్పారు. పెండింగ్ బిల్లుల కోసం అధికారులు, ప్రభుత్వ పెద్దల చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసిన ఫలితం దక్కకపోవడంతో తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని వాపోయారు. ఇలానే ఎంతో మంది మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. మాజీ సర్పంచులు తాము చేసిన పనులకు మాత్రమే బిల్లులు అడుగుతున్నారని, ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. తెలంగాణ వ్యాప్తంగా నేటికీ బిల్లులు అందక తీవ్ర నిరాశలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## 27న ధ్రువ పత్రాల పరిశీలన

తిమ్మాపూర్ రూరల్, జూన్ 24 : డీ సెట్-2025లో రెండో దశలో ప్రవేశాల కోసం ఉత్తీర్ణులైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువ పత్రాలను ఈ నెల 27న ఎల్ఎండీలోని ప్రభుత్వ జిల్లా వృత్తి విద్యా శిక్షణ సంస్థలో పరిశీలిస్తామని ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో రావాలని, రెండో దశ ప్రవేశాల కోసం ఆప్షన్స్ ఈ నెల 28 నుంచి 30 వరకు పెట్టుకోవాలని తెలిపారు. కళాశాల మార్పు, మొదటి దశలో సీటు రానివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డీ సెట్ http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

## రైతు వేదికలో ఖాళీ కుర్చీలు

వీర్నపల్లి, జూన్ 24: రైతుభరోసా విజయోత్సవ సంబురాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించగా, వీర్నపల్లి రైతు వేదికలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. రైతులతో సీఎం నేరుగా మాట్లాడేందుకు వీలుగా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయ గా, కార్యక్రమానికి వ్యవసాయాధికారులు తప్ప పెద్దగా రైతులు ఎవరు రాకపోవడంతో ఖాళీ కుర్చీలే మిగిలాయి. దీంతో సీఎంతోపాటు మంత్రుల ప్రసంగాన్ని అధికారులు మాత్రమే విన్నారు.


రైతులు రాక ఖాళీ కుర్చీలతో రైతు వేదిక


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- ఏ పథకం పూర్తిగా అమలు చేయకుండానే సంబురాలా..?
- ఎన్నికలు వచ్చినప్పుడే సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయా..?
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## ఎన్ని పంటలకు రైతు భరోసా ఇచ్చిన్రు?

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 24 : కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని పంటలకు, ఎకరాలకు రైతు భరోసా ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏదీ కూడా పూర్తిగా అమలు చేయకుండానే ఏదో సాధించినట్టు సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జీలుగ విత్తనాల ధరలు పెంచినందుకా..? లేక రుణ మాఫీ చేస్తామని మోసం చేసినందుకా..? 600 మంది రైతులు చనిపోయినందుకా..? రైతులకు బేడీలు వేసినందుకా..? ₹500 బోనస్ ఎగ్గొట్టినందుకా..? ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. రైతులు, ప్రజల పక్షానా ప్రభుత్వంపై పోరాటం సాగిస్తూనే ఉంటామని, కేసులు, వేధింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మళ్లీ ఇప్పుడు కూడా రైతులను మోసం చేసేలా వ్యవహరిస్తుందని, ఎన్నికలు వచ్చినప్పుడే సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని విమర్శించారు. ఇప్పటికీ మూడు పంటలకు రైతు భరోసా ఎగ్గొట్టి నాలుగోసారి కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 'కేసీఆర్ ఏడాదికి మూడు పంటలకు ఎందుకు రైతుబంధు ఇవ్వవు?' అన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎన్ని పంటలకు రైతు భరోసా ఇచ్చారో చెప్పాలన్నారు. రైతు భరోసా కింద సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు ఏడాదికి ₹15 వేలు ఇస్తామని చెప్పి అది ఇవ్వకుండానే సంబురాలు చేసుకోవడానికి కాంగ్రెస్‌కు సిగ్గుండాలని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎకరానికి ₹19 వేల బాకీ ఉందన్నారు. ప్రతి విషయంలోనూ రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి చెంపలు వేసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను విమర్శిస్తున్న బండి సంజయ్ బనకచర్ల ప్రాజెక్టుపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. చేతనైతే రేవంత్‌రెడ్డితో కలిసి తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకువస్తే సంజయ్‌కి సన్మానం చేస్తామన్నారు. ఎంత సేపు కేసీఆర్‌ను విమర్శించడం తప్ప తెలంగాణ కోసం ఏ పని చేయలేని దద్దమ్మ అని మండిపడ్డారు. ఇప్పటికైనా కేసీఆర్‌పై విమర్శలు మాని ప్రజల సంక్షేమం కోసం పని చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరిట మోసం

ముగ్గురిపై కేసు

హుజూరాబాద్ టౌన్/ ముకరంపుర, జూన్24 : హుజూరాబాద్ ప్రాంతంలో దళారులు రంగంలోకి దిగారు. ఎన్పీడీసీఎల్, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగ యువతకు గాలం వేస్తున్నారు. పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడమే కాదు, తప్పుడు ఆర్డర్ కాపీలు చేతిలో పెడుతూ నిండా ముంచుతున్నారు. తాజాగా ఓ నిరుద్యోగి ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురిపై హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన మాడుగుల ప్రవీణ్, యాంసాని వీరేశం, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన గుండెల్లి సంజీవ్‌తో పాటు మరి కొంత మంది గ్రూపుగా ఏర్పడ్డారు. ఎన్పీడీసీఎల్, ఎన్టీపీసీ, ఫారెస్ట్, పోస్టల్ డిపార్ట్‌మెంట్లో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ స్థాయి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగ యువతకు ఎరవేశారు. మాయ మాటలు చెప్పి అప్పటికప్పుడు ఖర్చుల కోసమని కొంత డబ్బులు తీసుకున్నారు. ఒరిజినల్ ఆర్డర్ కాపీ పోస్టులో వస్తుందని, తర్వాత ప్రతి వ్యక్తి నుంచి ఉద్యోగం కోసం ₹5లక్షల నుంచి ₹8లక్షల వరకు ఇవ్వాలని నమ్మించారు. లక్షల్లో డబ్బులు తీసుకొని మోసం చేశారు. తప్పుడు ఆర్డర్ కాపీతో మోస పోయిన ఒక నిరుద్యోగి మంగళవారం హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మాడుగుల ప్రవీణ్, యాంసాని వీరేశం, గుండెల్లి సంజీవ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా ఉద్యోగాల పేరిట మభ్యపెడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని ఏపీటీఎస్, విజిలెన్స్ పోలీస్ స్టేషన్ సీఐ షాదుల్లా బాబా చెప్పారు. ప్రభుత్వం ఏ ఒక్క ఉద్యోగానికి కూడా నోటిఫికేషన్ లేకుండా నియామకాలు చేయదని, దళారులను నమ్మి మోసపోకుండా నిరుద్యోగ యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.


మల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట అందోళన చేస్తున్న కుస్తాపూర్ గ్రామానికి చెందిన రైతులు

## ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనయ్.. రిపేరు చేయించండి

- పది రోజులైతంది పట్టించుకోండి
- నీళ్లు లేక పంటలెండుతున్నయ్.. కాపాడండి
- కుస్తాపూర్ గ్రామరైతుల వేడుకోలు
- మల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట అందోళన

మల్లాపూర్, జూన్ 24 : 'సకాలంలో వానలు పడ్తలేవు. మరో వైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనయి. నీళ్లందక మా పంటలు ఎండిపోతున్నయ్. ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరు చేయించండి. మా పంటలను కాపాడండి' అని మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ గ్రామ శివారులోని సుమారు 40 మందికి సంబంధించిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడై పోయి పది రోజులు గడిచిందని, ఎన్ని సార్లు విద్యుత్‌శాఖ అధికారులకు మొర పెట్టుకున్నా త మను పట్టించుకోవడం లేదని వాపోయారు. పది రోజుల నుంచి మక్క, పసుపు పంటలకు నీళ్లు లేక ఎండిపోతున్నాయని, వరి నార్లు పోయకుండా కరెంట్ కోసం ఎదురు చూస్తున్నామని తెలి పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.